క్లుప్తంగా

కలెక్టరేట్‌లో స్థలం కేటాయింపు



ఏపీ ఫైబర్ నెట్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో ఏపీ ఫైబర్ నెట్‌కు సంబంధించి భారత్ నెట్ ఫేజ్–2 పరికరాల ఇన్‌స్టాలేషన్ కోసం సర్వే నంబర్ 896/బీలో 1.5 సెంట్ల స్థలాన్ని కేటాయించినట్లు జేసీ నారపురెడ్డి మౌర్య ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఆమె కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. వెంటనే ఏపీ ఫైబర్ నెట్‌కు కేటాయించిన స్థలంలో కార్యకలాపాలను ప్రారంభించాలని సూచించారు. కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు వెంట ఉన్నారు.

సంక్షేమ బోర్డును కాపాడుకుందాం

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ బోర్డును కాపాడుకోవడానికి భవన నిర్మాణ కార్మికులు పోరాటాలకు దిగాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య భవన్‌లో కర్నూలు పెయింటింగ్ వర్కర్ల యూనియన్ రెండో మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించడం అన్యాయమన్నారు. వారికి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు జాఫర్ హుస్సేన్, ఆర్.నరసింహులు, కె.సుధాకరప్ప, మాబాషా పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన

కర్నూలు(లీగల్): భూ యాజమాన్య నూతన చట్టం రద్దు కోరుతూ కర్నూలు న్యాయవాదులు నాలుగవ రోజు నిరసన కొనసాగించారు. గురువారం ఉదయం జిల్లా కోర్టు ఆవరణ నుంచి ర్యాలీ చేపట్టి కొండారెడ్డి బురుజు, రాజ్‌విహార్, కొత్తబస్టాండ్, చౌరస్తాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం నాయుడు, బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, సీనియర్ న్యాయవాదులు ఓంకార్, గోరంట్ల నాయుడు, రామాంజనేయులు, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, రవి, షాఫత్ తదితరులు పాల్గొన్నారు.

9 లోగా ఓటు నమోదు చేసుకోవాలి



అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న నోడల్ అధికారులు

కర్నూలు కల్చరల్: అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కు నమోదు చేసుకోసుకోవాలని స్వీప్ నోడల్ అధికారులు పి.వి.రమణ, నాగిమీలీల సూచించారు. గురువారం స్థానిక వాసవీ మహిళా కళాశాలలో నూతన ఓటరు నమోదు, ఓటర్ కార్డులో మార్పులు, చేర్పులు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీలోగా నూతన ఓటరు నమోదుతో పాటుగా పేర్ల తప్పులు సరిచేయడం, నివా స్థలం మార్పు, చనిపోయిన వారి ఓటు రద్దు తదితర వాటిని సరిచేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తులు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లలో సంబంధిత ఏరియా బీఎల్‌ఓలకు సమర్పిస్తే ఓటర్ కార్డు జారీకి చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, ఉస్మానియా కళాశాల అధ్యాపకులు అబిద్ అలీ, షరీఫ్, గౌస్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

విపత్తు సహాయక పనుల్లో విద్యుత్ ఉద్యోగులు



విద్యుత్ పనులను పర్యవేక్షిస్తున్న సీఎండీ సంతోషరావు, ఎస్‌ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): మిచాంగ్ తుపాను ప్రభావంతో నెల్లూరు జిల్లాలో అస్తవ్యస్తమైన విద్యుత్ సరఫరా వ్యవస్థను పునరుద్ధరించే పనుల్లో విద్యుత్ ఉద్యోగులు బిజీగా ఉన్నారు. తుపాను నెల్లూరు జిల్లాపై తీవ్ర ప్రభావాన్ని చూపడంతో అక్కడ చీకట్లు కమ్ముకున్నాయి. దీంతో మరమ్మతు పనులు చేపట్టేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 155 మంది విద్యుత్ ఉద్యోగులు మూడు రోజుల క్రితం తరలివెళ్లారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావుతో పాటు కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతితో పాటు ఏడీఈలు రంగస్వామి, ఎల్లప్ప, సుబ్రహ్మణ్యం, ఏఈలు సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. కావాల్సిన సామగ్రిని తెప్పించడంతో పాటు నాణ్యతతో పనులు చేయించి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఉమాపతి పేర్కొన్నారు.

పచ్చని చెట్లు.. పూల ‘బాటలు’

మూడంచెలుగా పెరిగి ఆకట్టుకుంటున్న చెట్టు





నగరంలోని రోడ్ల మధ్య డివైడర్లపై మునిసిపాలిటీ అధికారులు ఏర్పాటు చేసిన మొక్కలు విరబూసి పట్టణవాసులకు ఆహ్లాదం పంచుతున్నాయి. చెట్టు నిండా రంగురంగుల పూలతో ఆకట్టుకుంటున్నాయి. కాగితపు పూల మొక్కలు నిండా విరబూసి గులాబీ, తెలుపు, ఎరుపు రంగు పూలతో మదిని దోచేస్తున్నాయి. వాటి మధ్య అందమైన చెట్లు విశాలమైన రోడ్లకు మరింత వన్నె తెస్తున్నాయి. వరుసగా ఒకే ఎత్తులో ఉన్న చెట్లు సైనికుల్లా సెల్యూట్ కొడుతూ నగరానికి వచ్చే వారికి స్వాగతం పలుకుతున్నాయి. అలాగే డివైడర్లకు వేసిన రంగురంగుల చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ బాటసారులను ఆకట్టుకుంటున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



రాజ్‌విహార్ వద్ద బ్రిడ్జిపై కుండీలో విరబూసిన పూల మొక్క



చిన్న పార్కు ప్రాంతంలో వరుస క్రమంలో పచ్చని చెట్లు



నగరంలోని రోడ్డు డివైడర్‌పై మొక్కలకు విరబూసిన కాగితాల పూలు



గాయత్రి ఎస్టేట్ నుంచి బిర్లా గడ్డ మార్గంలో డివైడర్‌పై పచ్చని చెట్లు

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని స్టాంటన్‌పురం, రోజా వన్, రోజా టు, వడ్డెగేరి, ఎర్రబురుజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య తనిఖీ చేశారు. కొత్తగా వచ్చిన మెడికల్ ఆఫీసర్లందరికీ అడ్మినిస్ట్రేషన్, జాతీయ ప్రోగ్రామ్స్ గురించి వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్రజల్లో అవగాహన ఎలా కల్పించాలో చెప్పారు. వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలని ఆదేశించారు. ప్రతి ఒక్క రోగితో సామరస్యంగా మాట్లాడి వారికి వైద్యం అందించాలని, అవసరమైన వారిని ఉన్నత ప్రమాణాలు గల ఆసుపత్రులకు రెఫర్ చేయాలని చెప్పారు. ఆసుపత్రిలోని ఇతర సిబ్బందితో ఎలా సమన్వయం చేసుకుని పనిచేసుకోవాలో సూచించారు. ఆసుపత్రిలో వర్క్ పెండింగ్ లేకుండా ఏ రోజు పని ఆ రోజే పూర్తి చేసుకోవాలని చెప్పారు.

ఇద్దరికి జైలుశిక్ష



నిందితులు మధు, గణేష్‌ను చూపుతున్న పోలీసులు

కర్నూలు(లీగల్): కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉల్చాల గ్రామంలో ఓ వృద్ధురాలిపై దాడి చేసి గాయపరచిన కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది జైలు, రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా పోక్సో కోర్టు గురువారం తీర్పు చెప్పింది. 2020 జనవరి 9వ తేదీన సాయంత్రం ఓ మైనర్ బాలిక పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన కొర్విపాడు మధు, బోయ గణేష్ చెయ్యి పట్టుకుని పక్కకు లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. బాలిక తప్పించుకుని ఇంటికి పారిపోయి నానమ్మకు విషయం చెప్పింది. ఆమె నిందితుడి ఇంటికెళ్లి ప్రశ్నించగా వారు దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈ ఘటనపై కర్నూలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జి.భూపాల్ రెడ్డి తీర్పు వెల్లడించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

చిప్పగిరి: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన కుందన గుర్తి గ్రామానికి చెందిన కేసరి నారాంజనేయులు (28) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. గుంతకల్లు పట్టణంలోని ఆంజనేయ స్వామి కూడలిలో గత మంగళవారం కడప ప్రాంతానికి చెందిన మస్తాన్ ద్విచక్ర వాహనం, కేసరి నారాంజనేయులు ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన కేసరి నారాంజనేయలును మొదట అనంతపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక గురువారం ఉదయం మరణించాడు. మృతుడికి భార్య రాణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించండి

కర్నూలు(సెంట్రల్): ముసాయిదా ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దడానికి ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర అదనపు ముఖ్య ఎలక్ట్రోరల్ ఆఫీసర్ హరేంద్రప్రసాద్ ఆదేశించారు. ఆయన గురువారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా రూపకల్పనపై కలెక్టర్లు, జేసీలు, ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల్లో స్వీప్, దేశ్ కా కామ్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో తప్పొప్పులను సరిదిద్దాలని ఆదేశించారు. కర్నూలు జిల్లాలోని ఓటరు సరవణ అంశాలను జేసీ నారపురెడ్డి మౌర్య రాష్ట్ర అదనపు ముఖ్య ఎలక్ట్రోరల్ ఆఫీసర్ హరేంద్రప్రసాద్‌కు వివరించారు. ముఖ్యంగా గుర్తించిన 13 జంక్ క్యారెక్టర్ (సరైన వివరాలు లేనివి) 77 ఓట్లు ఉన్నాయని, ఇందులో ఫారం–8 ద్వారా 56 సరి చేసినట్లు చెప్పారు. మిగతా ఓటర్లను డిసెంబర్ 12 లోపు విచారిస్తామని వివరించారు. పది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్ల విచారణను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె.మధుసూదన్ రావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

కుల దురహంకారంతో హత్యాయత్నం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీలో నివాసం ఉంటున్న మేఘనపై కులదురహంకారంతో హత్యాయత్నం చేసిన భర్త హరికృష్ణ, అత్తామామలను వెంటనే అరెస్టు చేయాలని ఏపీ మహిళా సమైక్యా జిల్లా కార్యదర్శి పి.శ్రావణి డిమాండ్ చేశారు. మేఘనపై జరిగిన హత్యాయత్నాన్ని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ఏపీ మహిళా సమైక్య, యువజన సమైక్య, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, ఏపీ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, ఏఐవైఎఫ్ జిల్లాకార్యదర్శి బీసన్న పాల్గొన్నారు.

● కులదురంహకారానికి గురై ఆసుపత్రిలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న దళిత మహిళ మేఘనకు న్యాయం చేయాలని కోరుతూ ఏపీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పీడీ సాయిప్రదీప్, మాజీ సభ్యుడు సత్తి రాజశేఖర్ గురువారం డీఆర్వో కె.మధుసూదన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని, హత్య చేసేందుకు ప్రయత్నించిన భర్త, అత్తామామలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

11 నుంచి ‘మిషన్ ఇంద్రధనస్సు’

కోడుమూరు రూరల్: గర్భవతులు, చిన్నారుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వ్యాధుల నివారణకు తక్షణ చర్యలు తీసు కోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశమై గర్భవతులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇవ్వాల్సిన టీకాలపై చర్చించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారులు, గర్భవతులకు నెలవారి వ్యాక్సిన్లు వేయాలని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్లు శారద, ఉమాభాయి తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్): పెద్దపాడుకు చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి ప్రయత్నించిన అల్లాబకాష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, ఉపాధ్యక్షురాలు కేఎస్ పద్మ, ఓల్డ్ సిటీ కార్యదర్శి బంగి పద్మ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్ల బాలికపై 60 ఏళ్ల వ్యక్తి అత్యాచారానికి ప్రయత్నించడం అన్యాయమని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

● కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన దళిత మహిళ మేఘనను హత్య చేసేందుకు ప్రయత్నించిన భర్త హరికృష్ణ, అత్తామామలను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మేఘన తన పేరిట ఉన్న ఆస్తిని తల్లిదండ్రులకు బదలాయించడం కోసం సంతకం పెట్టడంతో ఆమెపై కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసి చంపే ప్రయత్నం చేశారన్నారు. కొన ఊపిరితో కర్నూలు పెద్దాసుపత్రిలో ఉన్న ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ఆర్‌యూ హాస్టళ్లలో మెనూ పాటించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం హాస్టళ్లలో మెనూ పాటించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు గురువారం వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఫజుల్ రెహమాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. చాలీచాలని ఆహారంతో విద్యార్థులు అర్ధాకలితో ఉండాల్సి వస్తుందన్నారు. మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడంతో దారుణంగా ఉన్నాయన్నారు. హాస్టళ్లను సక్రమంగా నిర్వహించాలని లేని పక్షంలో విద్యార్థిలోకం ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, జిల్లా కోశాధికారి మునిస్వాములు, వర్సిటీ ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, సహాయ కార్యదర్శి పవన్‌కుమార్ వీసీకి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

11న కార్తీక మాస సత్సంగ సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 11వ తేదీన బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి, ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య, గాయత్రీ బ్రాహ్మణ సంఘం సంయుక్తంగా కార్తీక మాస సత్సంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయా సంఘాల నేతలు తెలిపారు. గురువారం స్థానిక దేవి ఫంక్షన్ ప్యాలెస్‌లో జరిగిన సమావేశంలో హోంగార్డ్స్ రిటైర్డ్ ఎస్పీ చంద్రమౌళి, ఎంపీటీసీ పసుపుల మురళీకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, కార్యదర్శి కంచుగంటల శ్యాం సుందర్‌రావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సత్సంగ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు జ్వాలాపురం శ్రీకాంత్, రాష్ట్ర అధ్యక్షులు వెల్లాల మధుసూధనశర్మ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. 11న సాయంత్రం 4 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ నేపథ్యంలోనే కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు కే.చంద్రశేఖర్, నాగులవరం రాజశేఖర్, చల్లా నాగరాజశర్మ, దావనగేరి ఆనందరావు, కే నరేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కల్లూరు: పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు విద్యార్థుల ఆరోగ్యంపై ప్ర త్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్రీయ బాలస్వా స్థ్య కార్యక్రమం అధికారి హేమలత సూచించా రు. గురువారం ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనత గురించి అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉలిందకొండ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ నాగరాజు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు మండలంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడు గ్రామానికి చెందిన 100 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహంలో పందిపాడుకు చెందిన డీలర్ శేఖర్, లాయర్ రాజు, గుమ్మళ్ల శేఖర్‌తో పాటు 100 కుటుంబాల వారు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ కలసి పనిచేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. పందిపాడులో ఎలాంటి సమస్య వచ్చినా అందరికీ తోడుగా, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో సుధాకర్, దానియేలు, బాలు, వెంకటేష్, శేషు, శివుడు, వెంకటేశ్వర్లు, రాంబాబు, మురళి, సూరి, శంకర్ తదితరులు ఉన్నారు. వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలనతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నాయకత్వం నచ్చి పార్టీ చేరామన్నారు. కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు భీమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి



17వ వార్డులో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతగానో లబ్ధి చేకూరిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు క్లస్టర్–2 అధ్యక్షుడు కేదార్‌నాథ్, కార్పొరేటర్ పద్మలతా రెడ్డి అన్నారు. గురువారం స్థానిక 17వ వార్డు లక్ష్మీ గార్డెన్స్‌లో ‘వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం’ జరిగింది. ఈ సందర్భంగా సచివాలయం నంబర్ 41 పరిధిలోని కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ మేయర్ బంగి అనంతయ్య, పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, అక్బర్ వలి, రవి, రాము, సూర్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే ‘ఉన్నతి’



మహిళా లబ్ధిదారులకు ఆటో కీ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు కల్చరల్: మహిళల ఉన్నతికి జగనన్న ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఏపీ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉన్నతి – ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా మంజూరైన ఆటోలను గురువారం స్టాంటన్‌పురం వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో లబ్ధిదారులైన మహిళలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ నుంచి ఒక్కొక్క ఆటోకు రూ.2,70,934 చొప్పున వడ్డీలేని రుణంతో నాలుగు ఆటో రిక్షాలను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించామన్నారు. ఇందుకు ప్రభుత్వమే వడ్డీ భారం భరిస్తుందన్నారు.వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ విజయశేఖర్, సీఐ మన్సురుద్దీన్, ఎస్‌ఐ మన్మథ్‌విజయ్

సి.బెళగల్: డివిజన్‌లో శాంతి భద్రల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. ఆయన గురువారం వార్షిక తనిఖీలో భాగంగా సి.బెళగల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిసరాలు, పోలీసుల నివాసాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మన్మథ్‌విజయ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది డీఎస్పీకి గౌరవ వందనం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాలలో గతంలో అక్రమ మద్యం కేసులు అధికంగా ఉండేవని, అయి తే అక్రమ మద్యం రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవ డం కారణంగా కేసులు గణనీయంగా తగ్గాయ న్నారు. ప్రజలకు, ఆయా సందర్భాలలో బాధితుల కు అండగా ఉండేందుకు ప్రభుత్వం పోలీస్ శాఖలో వివిధ సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. త్వర లో గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి శాంతి భద్రతలను పర్యవేక్షించాలని కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, ఎస్‌ఐలను ఆయన ఆదేశించారు. అ లాగే నిఘా పటిష్టం చేసి రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలను పసిగట్టి నేరాల నియంత్రణకు కృషి చే యాలన్నారు. ఏపీ పోలీస్ యాప్‌తో ప్రజలకు పో లీస్ సేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు. ఏఎస్‌ఐ నాగయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.